# యువతను కబళిస్తున్న గంజాయి

- చిన్న చిన్న ప్యాకెట్లలో అమ్మకాలు
- మత్తులో తల్లిదండ్రులపై తిరగబడుతున్న వైనం
- భద్రాచలం, చింతూరు ఏరియాల నుంచి దిగుమతి
- చీకటి పడితే చాలు గంజాయి సిగరెట్ల పిలుపులు
- పోలీసు కేసులు, జైళ్ళ పాలైన యువకులు




# నవభూమి

## జిల్లా అనుబంధం

14 ఏప్రిల్,2025 సోమవారం పేజీలు:7

www.epaper.navabhoomi.in




**ధర్మపురి శ్రీనివాసాచారి / టేకులపల్లి ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** వేయి పడగల గంజాయి సర్పం విష కాటుకు యువత బలి అవుతోంది. వారి జీవితాలు నిర్జీవంగా మారుతున్నాయి. చీకటి పడితే చాలు యువకులు బ్యాచులు బ్యాచులుగా వాగులు, నిర్మానుష్య ప్రదేశాల వైపు సాగిపోతున్నారు. సిగరెట్లలో ఉన్న పొగాకును తీసివేసి అందులో గంజాయి చూర్ణాన్ని నింపి, సిగరెట్లు తాగుతూ ఆ మత్తులో తేలిపోతూ ఈ లోకాన్ని మర్చిపోతుంటారు. ఇలా గంజాయి మత్తులో ఎంజాయ్ చేస్తున్న యువకులు టేకులపల్లి మండలంలో అనేకమంది ఉన్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ మత్తులో తాము ఏమి చేస్తున్నామో తెలియని పరిస్థితి. ఈ గంజాయి చూర్ణం చిన్న చిన్న ప్యాకెట్లను అమ్మకాలు కొనసాగుతున్నట్టు నవభూమి పరిశీలనలో తెలియ వచ్చింది. ఈ ప్యాకెట్లు మండలంలోని చాలా గ్రామాల్లో రహస్యంగా లభ్యమవుతున్నట్టు తెలిసింది. అయితే ఈ ప్యాకెట్ల రేటు అందరికీ అందుబాటులో ఉండే విధంగా 10 రూపాయల నుంచి 15 రూపాయల వరకు ఉండడం గమనార్హం. దాంతో యువకులు ఈ ప్యాకెట్లను సులభంగా, విరివిగా కొనుగోలు చేస్తున్నారు. గంజాయితో ఎంజాయ్ చేయకపోతే ఆరోజు గడిచే పరిస్థితి లేని విధంగా యువత బానిసయింది. దీని మత్తులో ఇంటిదగ్గర లాంటి పనులు చేయకుండా యువకులు తమ ఇష్టారాజ్యంగా బలాదూరుగా తిరుగుతూ, తల్లిదండ్రులు మందలిస్తే వారి పైన తెగబడుతున్నారు. దాంతో పేరెంట్స్ ఏమి చేయలేని స్థితిలో తీవ్ర మనోవేదన చెందుతున్నారు. అదేవిధంగా యువకుల మధ్య చిన్న చిన్న విషయాలపై గొడవలు పడుతూ ముఠాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులకు దిగుతున్నారు. అదేవిధంగా ఈజీగా డబ్బులు ఎక్కువ మొత్తంలో సంపాదించుకునేందుకుగాను గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారు. మోటారు సైకిళ్లపైన, ఆటోల్లో, వ్యాన్లలో, కార్లలో గంజాయి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకునే క్రమంలో అనేకసార్లు పోలీసులకు పట్టుబడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. వారి పైన పోలీస్ కేసులు ఎన్నో నమోదయ్యాయి. కొంతమంది స్త్రీల పాలు కూడా అయిన సంఘటనలు ఉన్నాయి. అయినా కూడా ఈ గింజ అమ్మకాలు మాత్రం ఆగడం లేదు. గంజాయి అమ్మకాలను కొనసాగించే కొంతమంది యువకులు డబ్బుల ఆశ చూపి, అమాయకులైన విద్యార్థులు, యువకులను ఈ ఊబిలోకి లాగి వారిచేత గంజాయి రవాణా చేయిస్తున్నారు. ఈ గంజాయి చింతూరు, భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి ఇక్కడికి తెస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసు నిఘాలు కూడా చేదించుకుంటూ తన నమ్మకాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఈ గంజాయి దందా వెనుక కొంతమంది పలుకుబడి ఉన్న పెద్దలు, నాయకుల హస్తం ఉన్నట్లు, వారి కనుసన్నల్లోనే కొనసాగుతున్నట్టు ఆరోపణలు వెలువడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతో పాటు రాష్ట్రంలో ఏదో ఒకచోట తరచుగా గంజాయి పోలీసులకు పట్టుబడుతూనే ఉంది. ఏది ఎలా ఉన్నా టేకులపల్లి మండలంలో గంజాయి దందాని నిర్మూలించాలంటే పోలీసులు మరింత అప్రమతులతో నిఘా పెంచాల్సిన అవసరం ఎంతో ఉందని మండల వాసులు కోరుతున్నారు.



# మంత్రి తుమ్మలను సన్మానించిన ఏపి ఆయిల్ పామ్ రైతులు

**కొత్తగూడెం ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** నూనె దిగుబడి శాతం నిర్ధారించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ కు చెందిన పామ్ ఆయిల్ గెలలు అశ్వారావుపేట లోని పామాయిల్ ఫ్యాక్టరీలో ఆడించినందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు ఏపీ రైతులు ఆదివారం గండుగులపల్లిలో ఘనంగా సన్మానించారు. ఇటీవల అక్కడి రైతులకు కేవలం 17 శాతం మాత్రం ఆయిల్ శాతం లెక్కగట్టి ఇస్తున్నారు. దీనితో తెలంగాణతో సమానంగా గెలలకు రేటు కట్టాలని ఏపీ రైతులు డిమాండ్ చేశారు. దీనితో దిగుబడి తెలుసుకునేందుకు ఏపీ లోని అయిదు జోన్ల గెలలు సుమారు వేయి టన్నులు అశ్వారావుపేట లో మిల్లులో మర పట్టారు. తెలంగాణ లో 19.42 శాతం ఉన్న ఆయిల్ దిగుబడి, ఆంధ్రప్రదేశ్ గెలలకు 19.36 శాతం వచ్చింది. దీనితో గెలల్లో లోపం లేదనిఆయిల్ దిగుబడి రెండు దాదాపు సమానంగా వస్తున్నట్టు తేలింది. అశ్వారావుపేట ఫ్యాక్టరీ టెక్నీషియన్ లు ఏపీ వెళ్లి అక్కడి ఫ్యాక్టరి లలో లోపాలు కనుగొని సరిచేశారు. అక్కడి ఫ్యాక్టరీ లు ఆధునీకరించక పోవడం



తో ఆయిల్ శాతం తగ్గుతోందని గ్రహించారు. వీటన్నింటికి అనుమతులు ఇచ్చినందుకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మలకు ఏపీ రైతులు ఘనంగా సన్మానించారు. హర్షం వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల చొరవతో అశ్వారావుపేట ఫ్యాక్టరీ సైతం పాతదే అయిన ఎప్పటికప్పుడు ఆధునీకరణ వల్ల అశ్వారావుపేట లో మంచి ఆయిల్ దిగుబడి వస్తోంది



# జిల్లాకు విచ్చేసిన హైకోర్టు జడ్జి

**కొత్తగూడెం ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కే. శరత్‌ను సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

# హరిత ప్రేమికుడికి.. కన్నీటి వీడ్కోలు

- వనజీవిని కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- పాడెమోసిన ఖమ్మం రూరల్ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్
- చివరిగా వీడ్కోలు పలికిన ఖమ్మం డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్
- అధికారుల పర్యవేక్షణ.. కానీ కానరాని అధికారిక లాంఛనాలు..

**ఖమ్మం-నవభూమిబ్యూరో:**హరిత ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి (దరిపెల్లి) రామయ్యకు ప్రకృతి ప్రేమికులు, గ్రామస్తులు, అధికారులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామయ్య.. ఈ నెల 12న తెల్లవారుజామున రామయ్య తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూసిన విషయం విదితమే. ఆదివారం అతడి స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు రామయ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. రామయ్య తుదిశ్వాస విడిచిన దగ్గర నుంచి మొదలుకొని ఆఖరి మజిలీ పూర్తయ్యే వరకూ ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు స్వయంగా అన్ని ఏర్పాట్లూ ఏర్పాచేశారు. అంత్యక్రియల సందర్భంగా స్వయంగా పాడె మోశారు. రామయ్య పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. వనజీవి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలోనే జరిగినప్పటికీ అధికారిక లాంఛనాలతో మాత్రం జరగలేదు.

అంత్యక్రియల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటలకు రెడ్డిపల్లిలోని రామయ్య ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర.. మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్ చివరిసారిగా రామయ్య పార్థీవదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అటవీశాఖ సిబ్బంది పరేడ్ అనంతరం అంతక్రియలు ముగిశాయి. అంతిమయాత్రలో పాల్గొన్న సామాజిక వేత్తలు వనజీవితో వారికున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని శోకసంద్రంలో మునిగిపోయారు. రామయ్య అంత్యక్రియలు పూర్తయిన అనంతరం అక్కడి వైకుంఠధామంలో ఆయన అభిమానులు మొక్కలు నాటారు. ఆర్డీవో నర్సింహారావు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, ప్రముఖ సామాజిక వేత్తలు సురేశ్ గుప్తా, గడ్డం రాజశేఖర్, జిల్లా ఆసపత్రుల సమన్వయకర్త డాక్టర్ కేసగాని రాజశేఖర్, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి పొంగులేటి నివాళి..**పద్మశ్రీ వనజీవి రామయ్య పార్థీవదేహానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, నీటిపారుదల, అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు ఆదివారం ఉదయం రెడ్డిపల్లిలోని రామయ్య ఇంటికి వెళ్లి ఆయన పార్థీవదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అనంతరం రామయ్య సతీమణి జానకమ్మను పొంగులేటి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీపీ సునీల్‌దత్, ఏసీపీ తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

**సొమ్మసిల్లి పడిపోయిన రామయ్య సతీమణి..**

మరికాసేపట్లో వనజీవి అంతిమయాత్ర ప్రారంభం కాబోతున్న సమయంలో ఆయన సతీమణి జానకమ్మ ఒక్కసారిగా సొమ్మసల్లి కుప్పకూలిపోయారు. దీంతో అక్కడే ఉన్న బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

## పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు

**పాల్వంచ టౌన్ ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం- జగన్నాథపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మ గుడి) లో ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండి పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండే కాక ఇతర జిల్లాల నుండి భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. మరియు అన్నప్రా శనలు, వాహన పూజలు,తలనీలాలు, అమ్మవారికి ఒడి బియ్యం,చీరలు, కనుములు,తదితర మొక్కులను చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదములనుస్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థానం సిబ్బంది, పర్యవేక్షించారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు.







## వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్జి దంపతులు

**ఏర్రుపాలెం,నవభూమి,ఏప్రియల్ 13 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూజివీడు స్పెషల్ కోర్ట్ జడ్జి వి కృష్ణమూర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు.వారికి ఆలయ అర్చకులు దేవాలయ సాంప్రదాయం ప్రకారంస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి మహా మండపంలో జడ్జి దంపతులకు వేద పండితులు,అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రములు,తీర్థప్రసాద ములనుఅందించారు.ఈకార్యక్రమములో ఆలయప్రధానఅర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ,ఉపప్రధానఅర్చకులుమురళీమోహన్ శర్మ,వెంకటరమణ,విజయ కృష్ణ,సాయి అభిలాష్ శర్మ,తదితరఅర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.



# పాల్వంచ పెద్దమ్మ తల్లి కమిటీ చైర్మన్ పదవి

- స్థానిక గిరిజనులతో భర్తీ చెయ్యాలి
- సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్



**పాల్వంచ టౌన్ ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:-** పాల్వంచ మండలం కేశ్వాపురం – జగన్నాథపురం గ్రామంలో సేవాలాల్ సేన సమావేశం ఆదివారం మండల అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పెద్దమ్మ తల్లి కమిటీ చైర్మన్ పదవిని గిరిజనేతరులకు ప్రభుత్వ అధికారులు కట్టబెడుతున్నారని అన్నారు. గిరిజన ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తున్నరని అన్నారు. గిరిజనులకు దక్కాల్సిన పెద్దమ్మ తల్లి కమిటీ చైర్మన్ పదవిని గిరిజనేతరులకు కట్టబెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాలలో చైర్మన్ పదవులు అన్నీ కూడా గిరిజనులతో భర్తీ చేయాలని ఏజెన్సీ చట్టాలలో ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ కొంతమంది అధికారులు డబ్బుకు లాలూచీపడి గిరిజనులకు దక్కాల్సిన పదవులను గిరిజనేతరులకు అమ్ముకుంటున్నారని అన్నారు. ఇలా గిరిజన చట్టాల ద్వారా గిరిజనేతరులులాభం పొందుతూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఏజెన్సీ చట్టాలను పట్టించుకోవాల్సిన అధికారులు ఎవరూ కూడా నోరు మెదపకపోవడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. గిరిజనులకు దక్కాల్సిన పదవిని గిరిజనేతురులకు కట్టబెట్టిన అధికారులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అందరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.1/70 యాక్ట్, పీసా చట్టాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ( పిఓ )ఏజెన్సీ ప్రాంతాలలో చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలతో కూడిన పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని రద్దు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనులతో పెద్దమ్మ తల్లి కమిటీ చైర్మన్, అన్ని పదవులు గిరిజనులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించారు. లేనిపక్షంలో సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, అదేవిధంగా ఐటిడిఏ భద్రాచలం ప్రాజెక్టు ( పిఓ ) కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, కిషన్ నాయక్, పవన్ నాయక్, పాల్గొన్నారు.

# రేపు ముక్తార్ పాషా స్థూపావిష్కరణ

**టేకులపల్లి ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు, ఐఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శి అమరుడు ఎస్కే ముక్తార్ పాషా స్థూపావిష్కరణ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం టేకులపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్ష మాట్లాడుతూ ముక్తార్ పాషా మారుమూల ఏజెన్సీ మండలమైన గుండాలలో 1962లో పోలీస్ పటేల్ ఇంటిలో జన్మించారని, మధ్యతరగతి కుటుంబం అయినప్పటికీ తను చదువుతున్న సమయంలో విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై, విప్లవ విద్యార్థి సంఘం పిడిఎస్యులో చేరారని అన్నారు. అంచలంచెలుగా ఎదుగుతూ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులుగా, ఐ ఎఫ్ టి యు జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, కరోనాతో మరణించారని, ఆయన మరణం కార్మిక వర్గానికి తీవ్ర లోటని అన్నారు. పాషా ఆశయాలను కొనసాగిస్తూ ఆయన కన్న కలలను నిజం చేస్తూ, ఆయన స్మారకార్థం నిర్మించిన స్థూపావిష్కరణ, బహిరంగ సభ ఈనెల




15వ తారీఖున ఉంటుందని, ప్రజలు, కార్మిక వర్గం జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భూక్య నర్సింగ్, ఎట్టి నరసింహారావు, బోడా మంచ, నోముల భానుచందర్, తోటకూరి సతీష్, బాలు, పాల్త్య శ్రీను, భూక్య రామకోటి, చంద్యా తదితరులు పాల్గొన్నారు.

# కట్టెకోలలకు సాహిత్య భాస్కర బిరుదు

- రామదాసు సాహితీ కళా సేవా సంస్థ 2వ వార్షికోత్సవంలో ఘనపత్కారం

**ఖమ్మం, నవభూమి ఏప్రిల్ 13:** నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు రామదాసు సాహితీ కళా సేవా సంస్థ "సాహిత్య భాస్కర" బిరుదును ప్రధానం చేసింది. సంస్థ రెండవ వార్షికోత్సవాన్ని ఆదివారం హైదరాబాదులోని త్యాగరాయ గాన సభ కళా సంగీత నాట్యవేదిక ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. దూత రామ కోటేశ్వరరావు రచించిన మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించి కవులను సత్కరించింది గత కొన్నేళ్లుగా సాహిత్య రంగంలో కట్టెకోల చేస్తున్న కృషిని సంస్థ గుర్తించింది సామాజిక స్పృహతో ప్రజలను చైతన్యవంతం చేసే విధంగా వచన కవిత్వంతో పాటు గజల్స్, రుబాయిలు, మధురిమలు, సప్తపదులు, మణిపూసలు, నానీలు లాంటి అనేక ప్రక్రియలలో కవితలు రాస్తూ సాహిత్య రంగంలో విశేషమైన కృషి చేస్తున్న కట్టెకోల చిన నరసయ్యను "సాహిత్య భాస్కర" బిరుదును ప్రధానం చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక




అధ్యక్షులు డా. దూత రామ కోటేశ్వరరావు సభా వేదికపై ప్రకటించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సాహిత్య భాస్కర బిరుదును ప్రధానం చేసి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ ముఖ్య అతిథి డాక్టర్ రాజగోపాల్, విశిష్ట అతిథులు నగర ట్రాఫిక్ అడిషనల్ డిసిపి తేజావత్ రామదాసు, డా. రాధా కుసుమ కట్టెకోలను అభినందించారు

# సూర్యనారాయణకు మంత్రి తుమ్మల ఆత్మీయ పరామర్శ





**కొత్తగూడెం ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరుకుల్ల సూర్యనారాయణ ను ఆదివారం ఉదయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శకు తుమ్మల చిన్ననాటి స్నేహితులు, రాజకీయంగా తనతో పాటు నడిచిన పలువురు తుమ్మల ని కలవగా నాటి అనుబంధాలను,జ్ఞాపకాలను తన సన్నిహితులతో కలిసి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వెల్ది జగన్ మోహన్ రావు, చల్లగండ్ల నరసింహారావు, కంచర్ల అప్పారావు, గుడిపూడి గాంధీ, పట్టణ ప్రముఖులు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం దరఖాస్తు తేదీని పొడిగించాలి

## కాంగ్రెస్ నాయకురాలు భూక్యా శ్రీదేవి నాయక్



**రుద్రంపూర్ ఏప్రిల్ 13 నవభూమి:** రాజీవ్ యువ వికాసం దరఖాస్తు తేదీ రేపటితో ముగియనుందని, దరఖాస్తు తేదీని పొడిగించాలని కాంగ్రెస్ నాయకురాలు భూక్యా శ్రీదేవి నాయక్ కోరారు. ఆమె మాట్లాడుతూ తేదీ ముగియడంతో పలువురు నిరుద్యోగ యువతీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత మూడు రోజులుగా ఈ స్కీమ్ కి అప్లై చేద్దామంటే పలుమార్లు సర్వర్ డౌన్ అవుతుందని, ఒక్కొక్కరికి గంటల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ప్రభుత్వ కార్యాలయాలు సోమవారం వరకు సెలవులు ఉండగా... ఎంతో మంది కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ లోనే ఉన్నాయని చెప్పారు. అప్లై చేస్కోని వారు ఇంకా చాలామంది ఉన్నందున చివరి తేదీని పొడిగించాలని నిరుద్యోగ యువతి కోరుతున్నారు. ఇప్పటికే అప్లై చేసుకున్నవారు సంబంధిత పత్రాలను నేడు, రేపు ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వొచ్చని అన్నారు.

# మరకత గణపతి దేవాలయం నవమ వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

**అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఏప్రిల్ 13:** ప్రపంచంలోనే అరుదైన మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం కానాజీ గూడ సికింద్రాబాద్ మరకత శ్రీ లక్ష్మీ గణపతి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు 16 -4 -20 25 నుండి 18 -4 -20 25 వరకు మూడు రోజులు జరుపుటకు సకల ఏర్పాట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని దేవస్థానంలో అంగరంగ వైభవంగా సభక్తి పూర్వకంగా జరిగే నవమ వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయు భక్తులకు ఆహ్వానం పలుకుతున్నామని ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు ఈ మూడు రోజుల బ్రహ్మోత్సవాలలో అనేక రకమైన హోమాలు నిర్వహిస్తారని ఈ మూడు రోజులు పాల్గొనే భక్తులు 18,000 ముందుగానే చెల్లించి గోత్రనామాలతో ఆలయంలో సంప్రదించాలని ఆయన భక్తులను కోరారు

# మహనీయుల ఆశయాలు కొనసాగిద్దాం:సీపీఎం



**ఎర్రుపాలెం,నవభూమి,ఏప్రియల్ 13:** మహానీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగిద్దామని మండల సిపిఎం పార్టీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు అన్నారు.మహాత్మా జ్యోతి రావ్ పూలే,అంబేద్కర్ మహానీయుల జయంతుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని మామునూరు గ్రామ సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు సగ్గుర్తి సంజీవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహనీయుల చిత్రపటానికి పూలమాలలువేసి ఘననివాళులర్పించారు. ప్రభాకర రావు మాట్లాడుతూ మహనీయులను స్మరిస్తూ నిరంతరం వారి స్ఫూర్తిని కొన సాగించాలని పిలుపునిచ్చారు.పరమత సహనం విరాజిల్లిన భరతభూమిపై అసహనం,మతవిద్వేషాలు చెలరేగుతున్నాయ నిదళితులు,మైనారిటీ, మహిళలు,ఆది వాసీల మీద నిరంతరం దాడులు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని, ఒక వైపు పూలే,అంబేద్కర్ ఆలోచనాస్ఫూర్తిని కొనసాగిస్తున్నాం అంటూవాటికి విరుద్ధం గా అసమ్మతిని ప్రకటించే,ప్రశ్నించే సామా జిక ఉద్యమకారులు,కమ్యూనిస్టులపై, కవులపై,కళాకారులపై ,జర్నలిస్టులపై, కిడ్నాప్లకు,భౌతిక దాడులకు,హింసకు పాల్పడటం అంబేద్కర్,పూలే ఆలోచన లకు విరుద్ధం కాదా అని ప్రశ్నించారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశంలో ఏకమత సంస్కృతిని వ్యాప్తి చేయడానికి బిజెపి తహతలాడు తుందని విమర్శించారు.బీసీ కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా బిజెపి మినహా అన్ని పార్టీలుప్రజాసంఘాలు పౌరసమాజం నిలదీస్తుంటే బిజెపిమాత్రంకనీసం ఆ వైపు గా ఆలోచన కూడా చేయడం లేదన్నారు. ఈకార్యక్రమంలో మండలకమిటీసభ్యులు షేక్ లలా,శాఖ కార్యదర్శి రామాల మోక్ష నందం,కన్నెబోయిన శ్రీను,షేక్ కరీం,బెతు శ్రీను, సుందరరావు, రాణి, కృష్ణ,స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత ఆదివాసి ఫోరం జిల్లా సదస్సును జయప్రదం చేయండి

## ఏఐటిఎఫ్ జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం



**గుండాల ఏప్రిల్ 13 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శెట్టిపల్లి గ్రామంలో నీ అల్లూరి సీతారామరాజు సెంటర్లో ఏప్రిల్ 25న ఏఐటిఎఫ్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పాస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం ఏఐటిఎఫ్ జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం మాట్లాడుతూ ఈనెల 25న భద్రాచలంలో ఏఐటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించడం జరుగుతుందని, దీనికి ఆదివాసి గూడాలలోని ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆదివాసి యువకులు మహిళలు విద్యావంతులు పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఆదివాసులకే ఇవ్వాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఏజెన్సీ జిల్లాగా ప్రకటించాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని వారు అన్నారు. మూలవాసులైన ఆదివాసులు నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని వారికి హార్దికంగా హార్దికంగా ప్రభుత్వం అందించాలని ప్రభుత్వం నుండి వచ్చిన ప్రతి పథకాన్ని ఆదివాసీలకు వర్తించేలా చొరవ చూపాలని వారు అన్నారు. ఆదివాసి చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని వారు అన్నారు ఆదివాసులలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నది. ఏజెన్సీ గ్రామాలలో ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థులు చదువులో ముందుకు పోలేకపోతున్నారు తద్వారా ఆదివాసి విద్యార్థులకు శ్రమ తప్ప ప్రత్యామ్నాయం లేదు కావున ఆదివాసి విద్యార్థులకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా ఆదివాసి గ్రామాలలోని ప్రతి ఒక్కరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన ఆర్థిక విసులుబాటు కల్పించాలని వారు అన్నారు. ఆదివాసి చట్టాలు ఎన్ని ఉన్నా ఆదివాసీలకు అవి అందని ద్రాక్ష లాగా ఉంటున్నాయి ఆర్థికంగా సాంఘికంగా సాంస్కృతికంగా ప్రతి గూడాన్ని కలెక్టర్ అధికారులు ప్రజా ప్రతినిధులు సందర్శించి ఆదివాసుల అభివృద్ధికై పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్ప భూమయ్య, బచ్చల సారయ్య, కల్తీ మల్లయ్య, కల్తీ సుధాకర్, ఢిల్లీ నారాయణ, కల్తీ బోర్రయ్యా, ఈసం ఆది నారాయణ, ఇర్ప రాజేష్, ఇర్ప దోనీ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆత్మస్థైర్యం కలిగించేలా చేతన ఫౌండేషన్ సేవలు

**ఇల్లెందు ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే క్రమంలో కారేపల్లి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన బానోతు సంతుకు చేతన ఫౌండేషన్ సహాయంతో మూడు చక్రాల బండిని అందజేశారు. ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ దొడ్డ సీతారామయ్య స్వయంగా ఈ బండిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఉండేందుకు అవసరమైన ఉపకరణాలను అందించడం చేతన ఫౌండేషన్ ముఖ్య లక్ష్యాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు ఫౌండేషన్ అనేక మందికి ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, కృత్రిమ పాదాలు పంపిణీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చంద్రకాని నవీన్, షేక్ రషీద్ పాల్గొని తమ సహకారాన్ని అందించారు. కాగా భూక్యా సంతూ నాయక్ సిపిఎం పార్టీ అనుబంధ ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఎంతో కమిట్మెంట్ గా పనిచేసే



సంతూ నాయక్ రోడ్ ప్రమాదం వలన నడవలేని స్థితిలో ఉన్నారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న సంతూ నాయక్ కుటుంబం ఆర్థిక, అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. క్షణం తీరిక లేకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు శ్రమించే సంతూ నాయక్ నడవలేని స్థితిలో ఇంట్లో ఉండలేని స్థితిలో మానసిక ఒత్తిడికి కూడా గురౌతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో చేతన ఫౌండేషన్ వారు మూడు చక్రాల బండి ని అందజేసి ఆ



కుటుంబంలో ఆత్మస్థైర్యంతో నింపారని గాదెపాడు ప్రాంత ప్రజలు అంటున్నారు.

# యువశక్తి దరఖాస్తుల గడువు తేదీని పొడిగించాలి



**గార్ల, నవభూమి, ఏప్రిల్ 13:** రాజీవ్ యువ శక్తి పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువు తేదీని పొడిగించాలని సిపిఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు ప్రభుత్వం అవకాశం కల్పించిన దరఖాస్తు జత చేయాల్సిన ధృవీకరణ పత్రాలు అందించడం లో రెవిన్యూ శాఖాధికారులు తాత్సారం, ఆన్ లైన్ సెంటర్ లలో ఓబిబిఎంఎస్ వెబ్ సైట్ల లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, దీనికి తోడు వరుసగా ప్రభుత్వ సెలవులు వచ్చాయన్నారు. ఈనెల 14వ తేదీన దరఖాస్తుల గడువు ముగుస్తుండటంతో నిరుద్యోగ యువత అనర్హులు గా మిగిలి పోయే అవకాశం ఉందని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి గడువు తేదీని పొడిగించాలని శ్రీనివాస్ కోరారు.

# 2 కుటుంబాలను పరామర్శించిన- ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పరామర్శ



**ఖమ్మం రూరల్, నవభూమి, ఏప్రిల్ 13:** మండలంలోని గోళ్లపాడు గ్రామంలో శాబాదు సత్యనారాయణ రెడ్డి చనిపోగా.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కాచిరాజుగూడెం గ్రామంలో గుడిసుట్టు చిన్నలాలయ్య మరణించగా... వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, నాయకులు వీరారెడ్డి, మద్ది కిషోర్ రెడ్డి, గుడిసుట్టు వెంకటేశ్వర్లు, నరసింహారావు, బోసు రెడ్డి, ఇడప నరసింహారావు, వెంకటరెడ్డి, ఉపేందర్, సంపెట శ్రీను పాల్గొన్నారు

# వరంగల్‌లో టిఆర్ఎస్ రజితోత్సవ సభను విజయవంతం చేయండి

**అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఏప్రిల్ 13:** బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 27న నిర్వహించే రజితోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మల్కాజ్గిరి నియోజకవర్గం స్థాయి సన్నాక సమావేశానికి అల్వాల్ నుండి కార్యకర్తలతో బయలుదేరారు. కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హాజరవుతారని అని చెప్పారు .

చలో వరంగల్ రజతోత్సవ సభ సన్నహాక సమావేశం మల్కాజిగిరి లక్ష్మీ సాయి గార్డెన్ కు బి ఆర్ ఎస్ కార్యకర్తలతో బయలుదేరిన అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆమె మాట్లాడుతూ మల్కాజ్గిరి సభకు బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్న తరుణంలో అల్వాల్ సర్కిల్ నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి యాదగిరి గౌడ్ చంద్రశేఖర్ ప్రేమ్ కుమార్ డోలి సుధీర్ సంతోష్ సాజిద్ లోకేష్ పాల్గొన్నారు

# విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించకూడదు

- శ్రీ చైతన్య స్కూలుకు గుర్తింపు లేదు
- సత్తుపల్లి ఎంఈఓ రాజేశ్వరరావు
- కార్పొరేట్ మోసాలపై సత్తుపల్లిలో నిరసన





**సత్తుపల్లి, నవభూమి, ఏప్రిల్ 13 :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేర్చుకునే విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించకూడదని మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో నారాయణ స్కూల్ లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుండగా పలువురు ఆ పాఠశాలకు వెళ్లి ఆందోళన చేశారు. టాలెంట్ టెస్టులు పేరిట విద్యార్థులను తల్లిదండ్రులను చేస్తున్న మోసాలపై నిలదీశారు. పాఠశాల ఆవరణలో ఆందోళన ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో విషయం స్థానిక మండల విద్యాశాఖ అధికారి దృష్టికి వెళ్ళింది ఆయన నారాయణ స్కూల్ కి వెళ్లి పరీక్షను నిలుపుదల చేశారు.విద్యార్థుల దగ్గర్నుంచి సమాధాన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. టీచర్లను క్లాసులకు పంపడం ఆపి అడ్మిషన్ల కోసం సెలవు దినాలు, ఎండల్లో, రోడ్ల వెంట తిప్పుతున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయాల్లో కూడా విద్యార్థుల ఇళ్ల దగ్గరకు నారాయణ పాఠశాల సిబ్బంది వెళుతున్నారని ఎంత పాఠశాల యాజమాన్యం అడ్మిషన్ల టార్గెట్లో భాగంగా జరుగుతోందని ఎంఈఓ దృష్టికి పలువురు తెచ్చారు. ఆ విధంగా వచ్చిన బాల, బాలికలకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. టాలెంట్ టెస్టులు, అడ్మిషన్ టెస్టులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంఈఓ నారాయణ పాఠశల యాజమాన్యాన్ని హెచ్చరించారు. టాలెంట్ టెస్ట్ విషయం జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లటంం జరిగిందని ఎంఈఓ రాజేశ్వరరావు వివరించించారు. డీఈవో ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో నిరసన కారులు ఆందోళన విరమించారు. స్థానిక కార్పొరేట్ పాఠశాలల వారు తమ గొప్పను చాటుకునేందుకు, రాష్ట్రస్థాయి ర్యాంకులు తమవే అని ప్రకటించుకునేందుకు విజయవాడ ,గుడివాడ తదితర ప్రాంతాలలో పదవ తరగతి చదివిన మెరిట్ విద్యార్థులను ఇక్కడకు తీసుకొచ్చి పాఠశాల తరఫున ఫీజు కట్టి పరీక్షలు రాయిస్తున్నట్లు స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఎంఈఓ కు ఫిర్యాదు చేశారు. సత్తుపల్లిలో గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ చైతన్య పేరిట నడుస్తున్న పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేదన్నారు. శ్రీ చైతన్య పేరుతో సత్తుపల్లిలో ఏ పాఠశాలకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. గుర్తింపు లేని పాఠశాలలలో విద్యార్థులను చేర్చి మోసపోవద్దని ఈ సందర్భంగా ఎంఈఓ తల్లిదండ్రులకు సూచించారు. కార్పొరేట్ మోసాలపై విచారించి చర్య తీసుకోవాలని సత్తుపల్లి డివిజన్ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల సంఘం(ట్రస్మా) ఎంఈఓ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేసింది.

# హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

- హత్య చేసేందుకు రూ.20 లక్షలు సుపారీ
- అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు
- పట్టుపడ్డ నిందితులు.. రిమాండ్ కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఖానాపురం హవేలీ సిఐ భాను ప్రకాష్







**ఖమ్మం క్రైం, నవభూమి, ఏప్రిల్ 13:** వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని సుఫారీ గ్యాంగ్ తో హత్య చేయించేందుకు యత్నించి పోలీసులకు చిక్కాడు ముదిగొండ మండలం సువర్ణపురం గ్రామానికి చెందిన కొండూరి ఆంజనేయులు అలియాస్ రాము. అతనితో పాటు సుపారి తీసుకున్న గ్యాంగ్ ను సైతం అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ తరలించారు ఖానాపురం హవేలీ పోలీసులు. ఇందుకు సంబంధించి ఖానాపురం హవేలీ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సువర్ణపురం గ్రామానికి చెందన తొట దర్మ అనే వ్యక్తి భార్యతో అదే గ్రామానికి చెందిన పోక్ క్లైనర్ డ్రైవర్ కొండూరి రామంజనేయులు అలియాస్ రాము వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం భర్త దర్మకు తెలియడంతో భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎలాగైనా ప్రియురాలి భర్త అడ్డు తొలగించి అక్రమ సంబంధం కొనసాగించాలని హత్యకు పథకం వేశాడు నిందుతుడు కొండూరి రామంజనేయులు. ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం గ్రామానికి చెందిన తన స్నేహితుడు డ్రైవర్, రౌడీషీటర్ అయిన దంతాల వెంకట నారాయణ అలియాస్ వెంకట్ ను రాము కలిసి విషయం తెలిపాడు. ధర్మను హత్య చేయాలని ఇందుకు కొంత నగదును సుపారిగా ఇస్తానని చెప్పడంతో అంగీకరించిన వెంకట్ అతని స్నేహితుడు, అగ్రహారం కాలనీకి చెందిన బైక్ మెకానిక్ పగడాల విజయ్ కుమార్ అలియాస్ చంటిని రాముకి పరిచయం చేస్తాడు. హత్య చేసేందుకు 20 లక్షల రూపాయలు సుపారిగా ఇవ్వాలని రాముని కోరడంతో అందుకు అంగీకరించిన రాము తొలత ఐదు లక్షలు అడ్వాన్స్ గా చెల్లిస్తాడు. పథకం ప్రకారం మార్చి 12వ తేదీన దంసలాపురం వద్ద ఉన్న ఓ దాబా దగ్గర బాధితుడు తోట ధర్మను రప్పించి విజయ్ కుమార్ తో పాటు అతని స్నేహితులైన అగ్రహారం, బృందావన్ కాలనీ కి చెందిన వేముల కృష్ణ, బుర్రి విజయ్ లతో కలిసి ధర్మాను కిడ్నాప్ చేసి ఎవరికి అనుమానం రాకుండా ఖమ్మం నగర శివారులోని ఓ నిర్మానుష ప్రాంతంలో ఉంచి ప్రధాన నిందితుడు, సూత్రధారి అయిన రామాంజనేయులతో వీడియో కాల్ చేసి ధర్మాను కిడ్నాప్ చేశామని చూపించి మిగిలిన సుపారి నగదును చెల్లిస్తే ధర్మను హత మారుస్తామని చెప్పగా అందుకు అతని నుంచి బదులు రాకపోగా ఫోన్ కట్ చేయడంతో పలు దఫాలుగా రాముకి ఫోన్ చేసిన ఫలితం లేకపోవడంతో కిడ్నాపర్లు తమ వెంట తీసుకువచ్చిన బాధితుడు ధర్మ ను బెదిరించి అతని వద్ద నుంచి 1,50,000 నగదును ఫోన్ పే ద్వారా తమకు బదిలాయించుకుని అతని ఒంటిపై ఉన్న బంగారు గొలుసును లాక్కొని అతనిని అక్కడ వదిలి సిఐ తెలిపారు. అనంతరం బాధితుడు ధర్మ ఖానా ప్రభువేలు పోలీసులు ఆశ్రయించి జరిగిన విషయం వారికి తెలియజేసి తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరడంతో వాల్తిని ఫిర్యాదు మేరకు ఏప్రిల్ 11న కేసు నమోదు చేసి ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి పర్యవేక్షణలో విచారణ ప్రారంభించినట్లు సిఐ భాను ప్రకాష్ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులకు ఈ నెల 13 ఆదివారం నగర పరిధిలోని చెరుకూరి మామిడి తోటలో సుపారి గ్యాంగ్ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి సదరు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. వారి నుంచి ఎయిర్ గన్, రెండు కత్తులు, 90 వేల రూపాయల నగదు, సెల్ ఫోన్స్, కారు స్వాధీనం చేసుకుని కోర్టుకి రిమాండ్ తరలించినట్లు సీఐ వివరించారు తెలిపారు.

# వనజీవి'కి పొంగులేటి నివాళి

- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, ప్రజలు
- వనజీవి మృతి చాలా దురదృష్టకరం, బాధాకరం
- రామయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం రూరల్, నవభూమి, ఏప్రిల్ 12:** పద్మశ్రీ వనజీవి రామయ్య పార్థీవదేహానికి కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో జిల్లా ప్రజలు ఆదివారం తుది వీడ్కోలు పలికారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా రామయ్య మనుమళ్లు దూర ప్రాంతంలో ఉండటంతో ఒకరోజు అంత్యక్రియలు వాయిదా వేశారు. కాగా ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రామయ్య అంత్యక్రియలు నిర్వహించారు. పద్మశ్రీ పాడెను కుటుంబ సభ్యులు, అభిమానులతో పాటు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ ఎత్తుకుని తుది వీడ్కోలు పలికారు. రెండు రోజుల పాటు ఇద్దరు అధికారులు అన్ని పనులు దగ్గరుండి చక్కబెట్టారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారం శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వనజీవి రామయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామయ్య సతీమణి జానమ్మను అక్కున చేర్చుకుని ఓదార్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..- వనజీవి పద్మశ్రీ రామయ్య మృతి చాలా దురదృష్టకరం, బాధాకరం అన్నారు. పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య మనకు కనిపించనంతగా దూరం అయ్యారని, రాష్ట్ర ప్రభుత్వ పక్షాన, తన పక్షాన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. మనిషి జీవించినంత కాలం ఏమి సాధించారన్నదే ఆలోచన చేయాలని సూచించారు. రామయ్య చెట్లను పెంచే కార్యక్రమంలో ఆర్థికంగా ఒడిదుడుకులు ఉన్నా కోటి మొక్కలు పైగా నాటారని కొనియాడారు. మొక్కలు పెంచడం వల్ల ప్రకృతికి, సమాజానికి కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరిస్తూ అనేక ప్రాంతాల్లో ఆయన మొక్కలు నాటారని తెలిపారు. వనజీవి రామయ్యకు చిరకాల కోరికలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెప్పారని, వాటన్నింటినీ సాధ్యాసాధ్యాలు పరిశీలించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నెరవేర్చడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట ఎంపీ రామసాయం రాఘురాం రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, పోలీస్ కమిషనర్ సునిల్దత్ తదితరులు పాల్గొన్నారు









## రాజీవ్ యువ వికాసం ఆన్ లైన్ గడువు పొడిగించాలి

### పనిచేయని ఆన్‌లైన్ సర్వర్
### పథకం పట్ల అవగాహన కల్పించటంలో అధికారుల నిర్లక్ష్యం, నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
### మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండి. యాకూబ్ పాషా



**పాల్వంచ ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ చేసుకునేందుకు గడువు తేదీని పొడిగించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వెబ్ సైట్ పనిచేయకపోవడం తో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న దరఖాస్తు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆన్‌లైన్ సక్రమంగా పనిచేయని కారణంగా వేల సంఖ్యలో దరఖాస్తుదారులు నష్టపోయే ప్రమాదం ఉందని, కావున ప్రభుత్వం వెంటనే ఆన్‌లైన్ గడువును పొడిగించాలని కోరారు. పథకం పట్ల దరఖాస్తుదారులకు సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవడం లేదని, రాజీవ్ యువ వికాసం పథకం పట్ల అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని మండిపడ్డారు. అధికారుల తీరుతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందన్నారు. తక్షణమే ఆన్లైన్ గడువు పెంచడంతోపాటు, ప్రజలకు ఈ పథకం పట్ల అవగాహన కల్పించేలా అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె





**దమ్మపేట ఏప్రిల్ 13 నవభూమి:** దమ్మపేట మండలం గోపాలపురం గ్రామంలో సీత రామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వాములవారు ముత్యాలమ్మ అమ్మవారు (నాభిశిల) బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవ వేడుకకు ఆదివారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరైయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం అర్చకులు గ్రామస్తులు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు

# సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట భోజనం

- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న



**రుద్రంపూర్ ఏప్రిల్ 13 నవభూమి:** సామాన్యుడితో కలిసి మెలగడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం ప్రజా ప్రభుత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం గృహజ్యోతి 200 యూనిట్లు కరెంట్, గ్యాస్ సబ్సిడీ 500 ఇందిరమ్మ ఇల్లు సన్న బియ్యం లాంటి మహోన్నత సంక్షేమ పథకాలను అందుకుంటున్న లాంటి మహోన్నత సంక్షేమ పథకాలను అందుకుంటున్న ప్రజానీకం కల్లోజీ.కుమారి పాల్వంచ వికలాంగుల కాలనీ వాస్తవ్యురాలైన నిరుపేద లబ్ధిదారుని ఇంట చేరుకొని వారింట ప్రభుత్వం అందించిన అందిస్తున్న సన్న బియ్యం తో కూడిన భోజనము చేయడం జరిగింది. భోజనం పెట్టిన లబ్ధిదారురాలు ఆడబిడ్డ కల్లోజి కుమారి కి మహిళా కాంగ్రెస్ తరపున బట్టలు పెట్టడం జరిగింది ఈ సందర్భంగా దేవి ప్రసన్న మాట్లాడుతూ



ప్రభుత్వం కొలువుతీరిన అతి తక్కువ కాలంలోనే ప్రజాభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తూ. ప్రజాధరణ పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంతన్న గారి సారధ్యంలో సన్నబియ్యం పథకము అనేది చారిత్రాత్మకమైనటువంటి ఘట్టం ఏళ్ల తరబడి దొడ్డు బియ్యాన్ని తిని విసిగివేసారి పోయినటువంటి పేదలు ధనవంతులతో సమానంగా సన్న బియ్యం తినడం అనేది నిజంగా పేదవాడి కంటిలో సంతోషం కనిపిస్తుంది ఆహార భద్రతను కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం సామాజిక సమానత్వం దిశగా అడుగులు వేస్తూ రాష్ట్రం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వాటిని అధిగమిస్తూ పేదవాడి కడుపు నింపే గొప్ప సంకల్పంగా సన్నబియ్యాన్ని పేదవానికి అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ మహిళా కాంగ్రెస్ సెక్రెటరీ బోడ దివ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లో కళ్యాణి, మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సుశీల, పాల్వంచ టౌన్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు అరుణ, లక్ష్మమ్మ అనసూర్య, చుంచుపల్లి మండల మహిళా కాంగ్రెస్ నాయకురాలు భూక్య శ్రీదేవి నాయక్, నాస్మిన్, సుజాత కీర్తి, సౌజన్య, నాగ, శనగ దీక్షిత, కుక్కమల్ల సౌందర్య, రెక్కల బేబీ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో దంచి కొట్టిన వడగండ్ల వాన





**అన్నపురెడ్డిపల్లి ఏప్రిల్ 13 నవభూమి:** మండలంలో సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం రావడం వరి మామిడి రైతులకి ఏమి చేయాలో తెలియని స్థితి లో రైతులు వాపోతున్నారు. ఇంత వరకు రబీ సీజన్ వరి పంట 80 శాతం వరకు కోతలు కాలేదు. దీనస్థితిలో ఉన్న రైతుల కుటుంబాలను ప్రభుత్వం తరుపున సహకారం అందించాలని కోరారు.

# నాగారంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎస్పీ రోహిత్ రాజ్



**పాల్వంచ ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** మండల పరిధి లో గల నాగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని జిల్లా ఎస్ పి రోహిత్ రాజ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శం గా తీసుకోవాలన్నారు. అంబేద్కర్ జయంతి సందర్బంగా ఒక రోజు ముందే అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం అదృష్టం గా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న డి ఎస్ పి సతీష్ కుమార్, సి ఐ సతీష్ లతో పాటు గంగపురి శ్రీను, రాయల భాస్కర్ తోకల లింగయ్య (చందు ), గంగపురి దుర్గా, గంగపురి చంటి, సిద్దుల గణేష్, సిద్దుల సుధీర్, తోకల ప్రసాద్, దుర్గప్రసాద్, ప్రేమ్ కుమార్, రాజు, శ్రీకాంత్, కళ్యాణ్, సీత రాములు, దుర్గ, దుర్గారావు, సృజన్, వీరబాబు, ఏసుబాబు, రాములు, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, రంజిత్, పవన్, వినయ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇంజెనియం స్కూల్‌ను ప్రారంభించిన దుండిగల్ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు, శంభీపూర్ కృష్ణ

**కుత్బుల్లాపూర్- ఏప్రిల్ 13 (నవభూమి ప్రతినిధి)-** నియోజకవర్గం దుందిగల్ మునిసిపాలిటీ పరిధి మల్లంపేట్ లోని సాయి బాలాజీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంజెనియం స్కూల్ ను ప్రారంభించిన దుండిగల్ నాయకులుశంభీపూర్ క్రిష్ణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఉప్పరి బాల కృష్ణ, నాయకులు కుంట్ల నందు, అశోక్, శ్రీశైలం యాదవ్, నిర్వాహకులు సురేందర్ రావు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పథకం రద్దుకు ప్రభుత్వం కుట్ర




**గార్ల, నవభూమి, ఏప్రిల్ 13:** కూలీ జనావళికి ఉపాధి నిచ్చే కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడానికి చూస్తుందని, కూలీల అప్రమత్తంగా ఉండాలని న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జడ సత్యనారాయణ కోరారు. గార్ల న్యూడెమోక్రసీ కార్యాలయంలో మట్టపల్లి వీరభద్రం అధ్యక్షతన జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యవర్గాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధిని కల్పించడం లేదని ఇటీవల కాలంలో 300 రూపాయల నుండి ఏడు రూపాయలు మాత్రమే పెంచిందన్నారు. ఇటీవల కాలంలో వంటగ్యాస్ ధరను 50 రూపాయలు పెంచారని 25 వేల రూపాయలు క్వింటా మిర్చిని 12 వేలకు తగ్గించాలని ఇది ఏమి తెలియజేస్తుందని ప్రజలని రైతాంగాన్ని కాపాడే పాలకులేనా ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిన 2005 నుండి ఉపాధి కూలీ రోజు వేతనం 87.50 రూపాయలు ఉన్నదని 20 సంవత్సరాల్లో కేంద్రం మాత్రం కేవలం 219 రూపాయలు మాత్రమే పెంచిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తే పోరాడి సాధించుకున్న చట్టం కోసం ప్రజలు తిరుగుబాటు చేస్తారని అన్నారు .బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు కూడా తక్కువ కేటాయిస్తున్నారని అవి దారి మళ్లించి అనుత్పాతక రంగాలకు కేటాయిస్తున్నారని ఇది కూలీలను నష్టపరచడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సక్కు, మనోహర్, ఇర్రి రవి, గుడు చుట్టు శంకర్, మాన్య, వి. సక్రు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్య ధన్యజీవి

# నివాళులు అర్పించిన వాకర్స్ క్లబ్ సభ్యులు

**జూలురుపాడు, ఏప్రిల్ 13 (నవభూమి ప్రతినిధి)-**మానవ జీవితానికి ప్రకృతి ఎన్నో విధాలుగా ఉపయోగడుతుంది.అందులో ముఖ్యమైనది వృక్షజాలం ప్రధానమైనది.మనిషికి ప్రాణ వాయువు అందించి ప్రాణాలు నిలుపుతుంది.యాభై ఏళ్ల గా లక్షలాది మొక్కలను నాటుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ ఇంటి పేరునే వనజీవి గా మార్చుకున్న పద్మశ్రీ దరిపల్లి రామయ్య శనివారం ఆయన ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో స్వగృహంలో మరణించారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజలు ఘన నివాళి అర్పిస్తున్నారు.దానిలో బాగంగా ఆదివారం మండల కేంద్రంలో ప్రకృతి ప్రేమికులు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆయన జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వేల్పుల నరసింహారావు,బోసు,తిప్పర్తి శివ,షేక్ బుడేన్ పాష,రామకృష్ణ,శంకర్ రావు,చిలుకూరు కోటేశ్వర రావు



నరేష్,నవీన్ రాథోడ్, కొండా వెంకటేశ్వర్లు, భాస్కర్, కమలాకర్,గురునాధం తది తరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ టీపీసీసీ పిలుపు మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్

- క్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ - ఏప్రిల్ 13: (నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా 26, 30, 31, 32, 33వ వార్డులలో జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతి రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరి వర్దన్ రెడ్డి కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ వారసత్వాన్ని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానపరచడం అంటే యావత్మన దేశప్రజలను అవమానపరిచినట్లే అన్నారు. బిజెపి పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాసౌమ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందాన్నారు. బిజెపి అసమర్ధ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో బస్తి నుండి బజారు వరకు జై బాపు. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.డివిజన్వాయి,మండల స్థాయి, బూత్ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు జై బాపు.. జై భీమ్.. జై




సంవిధాన్ కార్యక్రమంలో పాల్గోని విజయవంతం చెయ్యాలని కోరారు..ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, కోలన్ శ్రీనివాస్ రెడ్డి,జగదీష్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సురేంద్ర కుమార్ యాదవ్, అంజాద్, లక్ష్మణ్, శ్రీనివాసరావు, యువ కిరణ్ రెడ్డి, నాగిరెడ్డి, సాయికుమార్,వర్మ,మురళితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..

# ట్రస్మా మేడ్చల్ జిల్లా కమిటీ కార్యవర్గం ఎన్నిక

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 13, (నవభూమి ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యం సంఘం (ట్రస్మా) మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శామీర్ పేట లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా కాప్రా మండలానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ కు చెందిన బిర్రు ఆంజనేయులు, కోశాధికారిగా మేడ్చల్ చెందిన గిరిబాబు లను ఎన్నుకున్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి రామచందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్, హనుమంత్ రెడ్డి, రాంనర్సయ్య లు హాజరై ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు ఎన్నికల సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారం పై నిరంతరం పాటుపడతామన్నారు. మునుముందు మన ముందు ఎన్నో సమస్యలు ఎదురు కాబోతున్నాయని స్పష్టం చేశారు. వాటన్నిటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు

# పాల్వంచలో ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

## పాల్గొన్న టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె పాషా



**పాల్వంచ ఏప్రిల్ 13 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయం లి పతాక ఆవిష్కరణను సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు అర్వపల్లి సత్యనారాయణ నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె పాషా మాట్లాడుతూ పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విదంగా పెండింగ్ డి ఏ లను విడుదల చేయాలన్నారు. సిపిఎస్ ను రద్దు చేయాలని, మెడికల్ బిల్లులను, ట్రెజరీలో పెండింగ్లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్యాష్ లెస్ ఈహెచ్ఎస్ ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయభాస్కర్, మండల కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, రాజులు,ఎన్ శ్రీనివాసరావు, అంబ్రికా జాదవ్, మైనారిటీ వింగ్ కార్యదర్శి జీవన్, వి టి ఆర్, రాంబాబు, రహీముద్దీన్, అశ్వాపురం మండల ఉపాధ్యక్షులు మంగీలాల్, కోరం శ్రీనివాసరావు, పాష (సారపాక) తదితరులు పాల్గొన్నారు.

# డా. మణి మణి అనంద్ కుమార్‌కు ఉగాది స్పెషల్ నేషనల్ కళా జ్యోతి అవార్డ్ 2025 ప్రదానం



**ఖైరతాబాద్ ఏప్రిల్ 13 (నవభూమి ప్రతినిధి)-** రవీంద్ర భారతి హైద్రాబాద్ తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జ.సి.ఎస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రాజు నిర్వహించిన ఈ కార్యక్రమం ఉగాది పురస్కారాలు మరియు బాబు జగజీవన్ రావు జయంతి ఉత్సవాలు డాక్టర్ బి.ఆర్ ఆబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా విజన్ నేషనల్ బుక్ రికార్డ్ 2025 అవార్డుల ప్రదానం ఈ కార్యక్రమం లో ఉమ్మడి మహబుబ్ నగర్ జిల్లా నుండి అన్నదాత రక్తదాత సామాజిక సేవ కార్యకర్త విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు.గ్రహీత శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మణి మణి ఆనంద్ కూమార్కు వివిధ సామాజిక సేవ రంగంలో అందిస్తున్న నిస్వార్థ విశిష్ట సేవలను ఈ సంస్థ వారు గుర్తించి ఉగాది మహనీయుల ప్రత్యేక అవార్డ్ నేషనల్ కళా జ్యోతి అవార్డ్ 2025 తో పాటు ఘనంగా సన్మానం సత్కారం ప్రముఖల చేతుల మీద గా తిసుకొవడం జరిగింది నేషనల్ కళా జ్యోతి అవార్డు గ్రహీత మణి ఆనద్ కూమార్ మాట్లాడుతు గత ఇరవై సంవత్సరాలుగా నిస్వార్థతంగా ఈ సేవా కార్యక్రమాల ను చెస్తుతునదుక నాకు ఈ అవార్డు తీసుకోవడం నా పై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తు మీరు ఇచ్చిన ఈ ప్రోత్సాహం తో భవిష్యత్లో కూడా ఈ సేవా కార్యక్రమాల కొనసాగిస్తానని ఈ సందర్భంగా తెలియ చెస్తుతున ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శ్రీనివాస రాజు గద్దర్ కూతురు వెన్నెల దైవాఘున శర్మ తదితరులు పాల్గొన్ని వివిధ రంగాల వారికి ఉగాది పురస్కారలుఅందజేశారు చిన్నారుల సాంస్కృతిక నాట్య నృత్య ప్రదర్శన చేశారు

# తెలంగాణలో కీలక పాత్ర పోషించనున్న తెలుగుదేశం

- అంబేద్కర్ సిద్ధాంతాన్ని అమలు పరిచింది టిడిపినే
- పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ కార్యక్రమంలో అరెం రామయ్య



**జూలురుపాడు,ఏప్రిల్ 13 (నవభూమి ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను ఆదివారం ఆ పార్టీ జిల్లా నాయకులు అరెం రామయ్య పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం,బలగమని అన్నారు.ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని అన్నారు.ప్రతి సభ్యునికి ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తో దేశ రాజకీయాలలో పెను మార్పులు సంభవించాయి అని అన్నారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయం సిద్దాంతాన్ని అమలు పరచి రాజకీయ పదవులలో సమాజంలో అన్ని వర్గాలకు సమ న్యాయం కల్పించినట్లు వెల్లడించారు.పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత టి డి పి కే దక్కిందన్నారు. తెలంగాణలో గత పాలక పార్టీ తెలుగుదేశం పార్టీ ఉనికి లేకుండా విచ్ఛిన్నం చేయాలని సెల్ఫ్ గోల్ అయి రాజకీయంగా నామ మాత్రంగా మిగిలిందన్నారు.రాబోయే రోజులలో విజన్ కలిగిన నేత నారా చంద్రబాబు నాయుడు తెలంగాణలో సైతం పసుపు జెండాను అధికారంలోకి తెస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో చలమల గోవిందు, తిరువెంగళ రాజు,రోకటి బాబు,కృష్ణార్జున రావు,పొదిల రామారావు, రమేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రాన్ని పాలించే హక్కు కేసిఆర్‌కే ఉంది

- వరంగల్ సభను విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్





**ఏనుకూరు, నవభూమి, ఏప్రిల్ 13:** తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించే హక్కు కెసిఆర్ కె ఉందనిఈనెల 27వ తేదీ వరంగల్ లో జరిగే తెలంగాణ రజితోత్సవ సభను విజయవంతం చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ మదన్ లాల్ కోరారు. ఆదివారం స్థానిక సాయి రాగూర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం హామీలు ఇచ్చిందని,హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టి కాలం గడుపుతుందని ఆయన అన్నారు. ఈ రాష్ట్రాన్ని పాలించే హక్కు ఒక్క కేసీఆర్ కె ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలను కలుపుతూ సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత టిఆర్ఎస్ అధినేత కేసిఆర్కే దక్కిందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పనిచేసిన నాయకుడు కెసిఆర్ అని ఆయన కొనియాడారు.సంవత్సరం కాలం గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బాదావత్ బుజ్జి, మాజీ ఎంపీటీసీ వాసిరెడ్డి వెంకటేశ్వరావు,బి ఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ,చీటీ కోటేశ్వరావు,ఇంజం పుల్లయ్య, భూక్య బాలాజీ, నామ వెంకయ్య, ముదిగొండ నాగేశ్వరరావు, ఇటికాల రాజు,పూర్ణ కంటి నాగరాజు, రైలు, కాసిం,తదితరులు పాల్గొన్నారు

# బాబాసాహెబ్ రాజ్యాంగం కలలు కలగానే మిగిలి పోయాయా?

**కూకట్ పల్లి, ఏప్రియల్ 13 (నవభూమి ప్రతినిధి)** :హ్యూమన్ డెవలప్మెంట్ ఇండెక్స్%-%2022లో భారత్ 193 దేశాల్లో 134వ స్థానంలో నిలవడం దిగ్భ్రాంతికరమైన విషయం. ప్రపంచంలోని అత్యధిక యువత భారతదేశంలోనే ఉన్నా, వారి నైపుణ్యాలను వినియోగించుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నైపుణ్యాభివృద్ధి, సమానావకాశాల కల్పన వంటి రాజ్యాంగబద్ధమైన అంశాల్లో అమలు లేనిది ఆందోళనకరం. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్న సమానతా సమాజం ఇంకా దూరమే. అగ్రవర్ణాల నుంచి అనేక అవమానాలు ఎదుర్కొన్న అంబేద్కర్, కోలంబియా మరియు లండన్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య పొందుతూ, అణగారిన వర్గాలకు దిక్సూచి అయ్యారు. 1927 మహాద్ చెరువు పోరాటం ద్వారా కుల అసమానతలపై ఘాటుగా పోరాడారు. భారత రాజ్యాంగం, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం నిర్మితమైన గొప్ప పత్రం. ఇది కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుస్మృతి వంటి పూర్వ గ్రంథాలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. అయినప్పటికీ, దీన్ని అనుసరించకుండా, రాజకీయ పార్టీలు తమ స్వార్థాల కోసమే దీన్ని ఉపయోగించుకోవడం విచారకరం. రాజ్యాంగాన్ని ఇప్పటి వరకు 104 సార్లు సవరించినా, బహుజన వర్గాల ప్రగతిలో పెద్ద మార్పు కనిపించడం లేదు.

ఆర్టికల్ 15 ప్రకారం మతం, కులం, లింగం ఆధారంగా వివక్ష నిషిద్ధం. ఆర్టికల్ 17 ప్రకారం అస్పృశ్యత రద్దు. అయినా కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్షలు కొనసాగుతున్నాయి. గ్రామీణ భారత్‌లో అక్షరాస్యత ఇంకా 60 శాతం దాటలేదు. నిరుద్యోగం, అవినీతి, సామాజిక అసమానతలు ప్రజల జీవితాలను దుఃఖంలోకి నెట్టేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లపై బీజేపీ నేతల వ్యాఖ్యలు, రాజ్యాంగం సవరణల దిశగా చర్చలు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. లౌకికత్వాన్ని దెబ్బతీసే విధంగా మతపరమైన దాడులు దేశ ఆత్మకు తూట్లు పొడుస్తున్నాయి. డా. అంబేద్కర్ తన ఆలోచనల్లో విద్యా విప్లవం, భూ సంస్కరణలు, ఆర్థిక సమానత్వం ద్వారా సామాజిక మార్పును కలగాలన్నదే ఆశయంగా పెట్టుకున్నారు. కానీ ఈ రోజు బహుజనుల మధ్య ఉన్న అనైక్యత, కుల, మత రాజకీయాల వల్ల వారు అధికారానికి దూరమవుతున్నారు. అంబేద్కర్ ఆశించినట్టుగా మనిషిని మనిషిగా చూడడం



మానవత్వమని గుర్తించాలి. ఆయన రాసిన రాజ్యాంగం కేవలం చట్టపుస్తకాలకే పరిమితం కాక, ప్రజల మనస్సుల్లోకి చేరేలా ప్రజాప్రేరణాత్మక ఉద్యమాలు జరగాలి. దీనిలో భాగంగా మేధావులు, ఉద్యోగులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు ముందుకు రావాలి. అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అవుతుంది.

ఎర్రవెల్లి జగన్ (డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ పురస్కార్ అవార్డు గ్రహీత), జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా వ్యాసం.